'ఊహూ! నాకు ఆ తాజమహాలే కావాలి–'

'హయ్యో! మీకు అర్థం కావటంలా—'

'ఆగు శేషయ్యా! నువ్వు ఎప్పుడూ నేను ఏది తలుచుకున్నా, దేని కోసం ముచ్చటపడినా ఇలాగే నిరుత్సాహ పరిచావు–ఇదుగో నా ఆఖరుమాట—ఇరవై నాలుగ్గంటలలోగా మన వూళ్ళో అటువంటి–ఆ ఆగ్రానగరంలో వున్నటువంటి—తాజమహాలుకు పునాది పడాలి–తెలిసిందా?'

'ప్రభూ, ఇది అసంభవం! దురన్యాయం! ఘోరం! మీరేం మాట్లాడుతున్నారో మీకు తెలియటంలా—'

'మరి మాటలు కట్టిపెట్టు శేషయ్యా–నేనంతా నిశ్చయించేసుకున్నా–'

'ఆఁ, ఆవిషయం కూడానా—?'

'ఏ విషయం! ఏ విషయమోయ్ శేషయ్యా!'

'ఆమె సంగతి–శ్రీ రాణీగారి సంగతి—'

'ఏమిటదీ అలా చూస్తున్నావు–ఆమె కేంతటస్థించిందీ?'

'ఆమె బ్రతికివుండగా మీకు తాజమహా లెక్కణ్ణుంచి వస్తుందీ???'

## కన్యాకుమారి

"శేషయ్యా?"

'హా ప్రభూ! అదేమిటీ?"

'ఖంగారుపడి గోల చెయ్యకు – ఈమె బెదిరిపోతుంది—'

'మీ వంశానికి కళంకం తెస్తున్నారు. ఎవరామె? ఈ పవిత్ర సింహాసనంమీద అటువంటి నీచురాలు...ఘోరం!'

'ఏం శేషయ్యాఁ! ఆ మాత్రం అర్హత లేదంటావా ఈమెకూ? చూడూ, అందంగా లేదూ? చారడేసి కళ్ళూ, నిగనిగలాడే దేహ చ్ఛాయా...?'

'బాగానే వుందండి—ఇంతకీ ఈమె మీ కెక్కడ దఖలు పడిందీ? మిమ్మల్నిలా భ్రష్టుచేసినవా రెవరూ?'

'పొద్దున్న నాయుడింటికి వెళ్లాను. తలుపుచాటున కన్పడ్డది. నాయుడు లేడింట్లో—కౌగెక్కించి తీసుకువచ్చేశాను...'

'బాగానే వున్నాయండి బుద్ధులు—అతడు ఏమనుకుంటాడూ ఈ దౌర్జన్యంచూసి ?'

'నేను దౌర్జన్యంచేసి తేలేదు—నన్నుచూసి ఇష్టపడే కౌగెక్కింది-'

'ఎంత అపఖ్యాతి ! తిన్నగా తీసుకువచ్చి సింహాసనం మీాదే కూర్చోబెట్టారు. దేవిగారూ, మాతృశ్రీగారుమూస్తే ఇంకేమన్నా వుందా ?'

'ఏమీా ఫర్వాలేదు. వాళ్లు ఇటువేపురారు. వచ్చినా, ఏంచేస్తారేం? నాఇష్టం నాది, నా వేడుక నాది. నాకు ఆనందాన్నిస్తూన్నంతసేపూ ఎవరైతేనేం?'

'ప్రభూ ! ఇది మనకి తగని పని—'

'చూడవోయి శేషయ్యా, ఇంత అందాలకుప్ప వచ్చిపడితే అలా నీరైపోతావేం ?—ఈమెపేరు తెలుసునా ? కన్యాకుమారి—బావుండ్లా ?'

'నా శ్రాద్ధమండి ! మీా పవిత్రత మంటగల్పింది—'

'అలా అనకు శేషయ్యా-ఈమెకు కోపం రాగలదు—'

'నన్ను చంపండి, కాల్చండి—మీాచర్యను నేను ఆమోదించను. వెంటనే ఆమెను సింహాసనంమీాంచి దింపండి—'

'శుద్ధ వెర్రివాడవోయి శేషయ్యా! ఇంత మాత్రానికే—'

'ఇంతమాత్రం చాలండి మీాకు అప్రదిష్ట తేవడానికి - దానికెలా సిగ్గు లేదో ప్రభువుల ప్రక్కన అలా సింహాసనమెక్కి కులకడానికి ! పెంటముండ ! వెంటనే-అమ్మగారిని పిలవమంటారా ?'

'వొద్దు శేషయ్యా, పిలవకు—'

'మరి దాని కౌగిలి విడవండి-వెంటనే దాన్ని ఇక్కణ్ణుంచి పంపించెయ్యండి—'

'ఎంత కఠినుడవోయి శేషయ్యా ! నేను ఈమెను విడవలేను—'

'అయితే దాన్ని ఏ తోటమాలి గుడిశలోనో పెట్టించండి—ఇక్కడ— ఈ సభావేదికమీద అది—రామ రామ—పాడు బుద్ధులు—'

'నా అందాల రాణి! కన్యాకుమారి! చూడు శేషయ్యా, ఎంత సుకుమారంగావుందో!'

'చూశానండి. ఇరవై గోళ్లేనా లేవు దానికి-పద్దెనిమిదే...'

## వేట

'శేషయ్యా?'

'ప్రభూ, నమస్తే!'

'సంతోషకరమైన వార్త-'

'ఏమిటి ప్రభూ?'

'ఈ ఉత్తరంచూడు-ఆ సీలు కళ్లకు అద్దుకో-'

'ప్రభూ! గవర్నరే?'

'ఆ! మరెవరనుకున్నావ్? వేట కొస్తున్నాట్ట-మన వూరు-'

'మహా సంతోషం!'

'గవర్నరు సెక్రెటరీ వ్రాశాడు ఆ ఉత్తరం.'

'చిత్తం చిత్తం! పరమానంద భరితుణ్ణయ్యాను'

'ఎన్నాళ్లనుంచో అనుకుంటున్నాను. అన్ని సంస్థానాలనీ దర్శించి మనమీద సొడ్డువేశాడేమా అని—'

'చిత్తం! ప్రభువుల కోరిక సిద్ధించే మహత్తర ఘడియలు సమీపిస్తున్నాయండి.'

'రేపు ఆదివారమే వస్తున్నాట్ట ఇక్కడికి-గవర్నరు-పరివారంతో-'

'చిత్తం! ధన్యుల మవుతున్నాం—'

'సోమవారం వేటకు వెడతాడట—'

'చిత్తం! చాలా మంచివాడిలా కన్పిస్తాడండి—'

'చాలా మంచివాడోయ్—లేకపోతే మనమీద అంత అభిమానం-'